క్లుప్తంగా

హనుమాన్ దేవాలయంలో పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా స్వామివారి పల్లకీసేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని ఈశ్వర్ కాలనీకి చెందిన అనుమారి వేణుగోపాల్ దేవాలయానికి మేళ తాళం బహూకరించారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులకు సత్కారం



తెలంగాణ, ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులతో నాయకులు

షాద్‌నగర్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులను శనివారం పట్టణ బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఏపీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్‌లను కలిసి ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు.

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న రమణయ్యగౌడ్

కేశంపేట: మండల కేంద్రానికి చెందిన జూలపల్లి పెద్ద అంజయ్య శనివారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, గ్రామానికి చెందిన గుండ్రాతి రమణయ్యగౌడ్ రూ.5వేల చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకాళి హోమం



హోమం నిర్వహిస్తున్న ధర్మాధికారి మాధవరెడ్డి

శంకర్‌పల్లి: మండల పరిధిలోని కొత్తగూడెంలో ఉన్న పాతాళ త్రికోణ మహా సుందరి ఆలయంలో ద్విముఖ మహాకాళి హోమ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో రోజు(శనివారం)లో భాగంగా ఉదయం నటరాజ సాంబ వివాహ హోమం, సాయంత్రం అఖండ కారిక హోమం చేశారు. ఈ హోమ కార్యక్రమానికి కొత్తగూడెంతో పాటు చుట్టూ పక్కన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మాధికారి మాధవరెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు నిత్య హోమాలు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పైపులైన్ గుంత.. ప్రయాణికుల చింత



ఇళ్ల ఎదుట పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంత

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయానికి వెళ్లే రహదారిలో ఇళ్ల ఎదుట నీటి పైపులైన్ మరమ్మతుల కోసం గుంతను తవ్వి వదిలేశారు. గుంత తీసి నెలరోజులవుతున్నా పూడ్చకపోవడం.. మట్టి రోడ్డుపై వేయడంతో వాహనాదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కంకరతేలి అధ్వానంగా మారిన కనకమామిడి రోడ్డు



శ్రీరాంనగర్ వద్ద రోడ్డు పరిస్థితి

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

నిధులు మంజూరైనా మొదలుకాని అభివృద్ధి పనులు

- గుంతలతో వాహనదారులకు తప్పని తిప్పలు
- వెంకటాపూర్–చందానగర్ రహదారి ప్రతిపాదనలకే పరిమితం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మొయినాబాద్: గ్రామీణ రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. చాలా ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో అడుగడుగునా గుంతలతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితమే నిధులు మంజూరైనా రోడ్డు పనులు ఇంతవరకు మొదలు కాలేదు. ఇది కనకమామిడి–వెంకటాపూర్ రోడ్డు పరిస్థితి. అదేవిధంగా కవేలిగూడ–చందానగర్ రోడ్డును ఆర్‌అండ్‌బీకి మార్చే ప్రక్రియ ప్రతిపాదనలకే పరిమితమైంది.

గుంతలతో నరకయాతన

మొయినాబాద్ మండలంలో చాలా గ్రామాల రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. మండలంలోని తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి రోడ్లపై పెద్ద పెద్ద గుంతలుపడడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లి నుంచి చిన్నమంగళారం వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. పెద్దమంగళారం నుంచి ఎలుకగూడ వెళ్లే రోడ్డులో అడుగుకో గుంత పడటంతో రాకపోకలకు నరకయాతన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగిరెడ్డిగూడ నుంచి బాకారం వరకు రోడ్డు పరిస్థితి కూడా ఇదే తీరుగా ఉంది. చిలుకూరు–మొయినాబాద్ రోడ్డుకు గతంలోనే నిధులు మంజూరైనా కొంతవరకు రోడ్డు వేసి.. మరి కొంతదూరం కంకర పోసి వదిలేశారు. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నిధులు మంజూరై రెండేళ్లైనా..

మండలంలోని కనకమామిడి గేటు నుంచి వెంకటాపూర్ వరకు సుమారు 8 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితమే గత ప్రభుత్వంలో రూ.6.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ ఇంతవరకు పనులు మొదలు కాలేదు. కాంట్రాక్టర్ పనులు పెట్టడంలేదని.. వికారాబాద్‌లో చేసిన రోడ్డు పనులకు సంబంధించిన బిల్లులు రాలేదని.. ఆ కారణంగానే కాంట్రాక్టర్ ఈ రోడ్డు పనులు చేయడంలేదని అధికారులు చెబుతున్నారు. ఈ రోడ్డుపై గుంతలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు అక్కడక్కడ మట్టి పోసి చదునుచేసి కొంతవరకు బాగుచేసుకున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

మండలంలోని చందానగర్ చౌరస్తా నుంచి పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్ మీదుగా శంషాబాద్ మండలంలోని కవేలిగూడ వరకు 16 కిలోమీటర్ల దూరం రహదారిని పంచాయతీ రాజ్ శాఖ నుంచి రోడ్లు, భవనాల శాఖకు మార్చాలని గత సంవత్సరం ఆగస్టులో స్థానిక నాయకులు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ రహదారి నిర్మాణంతో మూడు మండలాల మధ్య రాకపోకలు పెరగడంతో పాటు స్థానికులకు సైతం ఉపయోగపడుతుందని మంత్రికి తెలియజేశారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన 16 కిలోమీటర్ల దూరం రోడ్డును సర్వే చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో ఆగమేగాలమీద పరుగెత్తుకొచ్చిన అధికారులు రోడ్డు సర్వే చేశారు. 16 కిలోమీటర్ల దూరంలో ఎక్కడెక్కడ కల్వర్టులు, వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందో గుర్తించారు. రోడ్డు నిర్మాణానికి రూ.60 కోట్ల నిధులు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది ఈ రోడ్డు పరిస్థితి. పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆర్‌అండ్‌బీకి మార్చడానికి అంగీకరిస్తూ ప్రభుత్వానికి లేఖ రాశారు. కానీ రోడ్లు, భవనాల శాఖకు మారుస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఉత్తర్వులు జారీ చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి స్థానిక ప్రజాప్రతినిధి అంగీకారం తెలపడం లేదనే ప్రచారం జరుగుతోంది. అందుకే ఆర్‌అండ్‌బీ శాఖకు మారడంలో ఆలస్యం జరుగుతోందని స్థానిక నాయకులు మాట్లాడుకుంటున్నారు.

నరకయాతన పడుతున్నారు



రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఇంతవరకు ఏ ఒక్క రోడ్డుకు నిధులు మంజూరు చేయలేదు. కవేలిగూడ–చందానగర్ రోడ్డును ఆర్‌అండ్‌బీ శాఖకు మార్చుతున్నట్లు అధికారులు చెప్పారు. సర్వేలు కూడా చేశారు.. కానీ ఇంతవరకు ఆ ప్రక్రియ పూర్తికాలేదు. ఈ రోడ్లపై వెళ్తున్న ప్రజలు, వాహనదారులు నరకయాతన పడుతున్నారు.

– నస్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, శ్రీరాంనగర్

ప్రతిపాదనలు పంపాం



కవేలిగూడ–చందానగర్ రోడ్డు 16 కిలోమీటర్ల దూరం పంచాయతీరాజ్ రోడ్డును ఆర్‌అండ్‌బీ శాఖకు మార్చడానికి ప్రతిపాదనలు పంపాం. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కనకమామిడి–వెంకటాపూర్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కానీ కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టడం లేదు.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ డీఈఈ



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చేవెళ్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 1995–96 బ్యాచ్ విద్యార్థులు శనివారం సమ్మేళనం నిర్వహించారు. కేసారం సమీపంలోని శ్రీనివాస్‌గౌడ్ ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారందరూ ఒకచోట చేరి ఆనందంగా గడిపారు. ఒకరికొకరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని, ఆటాపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవన్‌బాబు, సంగీత దంపతులు, సతీష్, పూర్వ విద్యార్థులు బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, సంగమేశ్వర్, భీమయ్య, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేందర్‌రెడ్డి, కళ, అరుంధతి, అనిత, మంజుల, లక్ష్మీ, స్వర్ణలత, లీల, గణేశ్, గోపాల్, బాల్‌రాజ్, శ్రీకాంత్, రవీందర్, రాకేశ్, వెంకటేశ్, ప్రకాశ్, మహముద్, రెహమాన్, కృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి కమ్మగూడ, మన్నెగూడ, రాగన్నగూడ, తుర్కయంజాల్‌లో శనివారం ఆయన రూ.8.46 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

చెరువుకు జలకళ



మాసబ్ చెరువు

- నిండుకుండలా కనువిందు చేస్తున్న 'మాసబ్'
- మరో భారీ వర్షంతో అలుగుపారే అవకాశం

తుర్కయంజాల్: ప్రస్తుత వానాకాలంలో ఆశించిన మేర వర్షాలు లేక భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయాయి. సాగుకు కాదుకదా.. కనీసం తాగునీటికి కనాకష్టం పరిస్థితులు నెలకొన్నాయి. కానీ తుర్కయంజాల్ మాసబ్ చెరువుకు జలకళ సంతరించుకుంది. నిండుకుండలా కనువిందు చేస్తోంది. పురపాలక పరిధిలో ఇటీవల కురిసిన వరుస వర్షాలతో చెరువు.. పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. మరో భారీ వర్షం కురిస్తే.. అలుగుపారే అవకాశం ఉంది. 50 ఏళ్ల చరిత్రలో 2020 అక్టోబర్ నెలలో వరుణుడి ప్రతాపానికి చెరువు నిండి అలుగు పారిన విషయం తెలిసిందే. ఆ తరువాత కాలంలో వరుసగా సమృద్ధిగా వానలు పడుతుండటంతో అలుగు పోసింది. ఈ సారి ఇప్పటి వరకు చెరువుకు పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకుంది.

ముంపుముప్పు

మాసబ్ చెరువులో నీటిమట్టం పెరిగితే.. వాగు ద్వారా కింద ఉన్న ఇంజాపూర్‌లోని దిలావర్ ఖాన్ చెరువులోకి నీరు చేరుతుంది. దీంతో దిగువ కాలనీలకు ముంపు ముప్పు పొంచి ఉంది. ముఖ్యంగా ఆపిల్ అవెన్యూ కాలనీ జలమయం కానుంది. ఈ వెంచర్‌లోని కొన్ని అపార్ట్‌మెంట్లు, ఇళ్లు ఏటా నీట మునుగుతుంటాయి. దీనికి తోడు వాగు ఉగ్రరూపం దాలిస్తే.. కాలనీల రాకపోకలకు ఆటంకం తప్పదు. ఇందిరమ్మ కాలనీకి అదే పరిస్థితి. చెరువు పై భాగంలోని ఆదిత్యానగర్ కాలనీది అదే దుస్థితి. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాసబ్ చెరువు, దిలావర్‌ఖాన్ చెరువు నాలాలను పరిశీలించారు. నాలాపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని ప్రకటించారు.

బ్రిడ్జి నిర్మాణం చేపడితే..

మాసబ్ చెరువు నుంచి దిలావర్‌ఖాన్ చెరువుకు వెళ్లే నీరు.. ఇంజాపూర్ నుంచి తొర్రూర్ దారిలో డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద రోడ్డుపై నుంచే ప్రవహిస్తుంటుంది. ఆ సమయంలో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. 2020 లో వాగు వరద ఉధృతికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు జలమయం అయ్యారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపడితే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మునగనూర్ నుంచి హయత్‌నగర్‌కు వెళ్లే దారిలో గతంలో ఇబ్బందులు ఉండేవి. అక్కడ వంతెన నిర్మాణం పూర్తికా వడంతో సమస్య తీరిందని స్థానికులు పేర్కొంటున్నారు.

చదువుతో పాటు యుద్ధవిద్యలు ముఖ్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: విద్యార్థులకు చదువుతో పాటు యుద్ధవిద్యలు, క్రీడలు ముఖ్యమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సాయిరాజా కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర పాఠశాలల క్రీడల కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యకరమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు యుద్ధవిద్యలు, క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఆపద సమయంలో తమను తాము రక్షించుకోవడానికి ఎంతో ఉపయోగపతాయన్నారు. శరీరం దృఢంగా తయారు అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి కరాటే, కుంగ్‌ఫూ వంటి విద్యలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ చెన్నయ్య, నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మిద్దె గణేష్, రంగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను మోసం చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న జంగయ్య

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య

కొందుర్గు: ఇందిరమ్మ ఇళ్లకు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.6 లక్షలు ఇస్తామని చెప్పి, రూ.5లక్షల ప్రొసీడింగ్‌లు ఇవ్వడం సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య అన్నారు. సీపీఐ 8వ మండల మహాసభను శనివారం నాయకులు జంగయ్య, యామిని ఆధ్వర్యంలో రామచంద్రాపూర్‌లో నిర్వహించారు. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు అంతంత మాత్రమేనని, ప్రస్తుతం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రభుత్వం మోసం చేస్తే సహించేది లేదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు ఇచ్చేవరకు ఊరుకునేది లేదన్నారు. పేదల పక్షాన సీపీఐ ఎప్పుడు పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు అంజయ్య, వెంకటేశ్, జంగయ్య, రామకృష్ణ, యాదయ్య, శ్రీను, విజయలక్ష్మి, చిలకమ్మ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పెంపు హర్షణీయం



ఆర్.కృష్ణయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్

షాద్‌నగర్‌రూరల్: బీసీలు చేపట్టిన పోరాటాలతోనే ప్రభుత్వం స్పందించి 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని ప్రకటించిందని బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేశ్ అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై బీసీ సేన నాయకులు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చిత్రపటానికి శనివారం పట్టణంలో పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధనకు ఆర్.కృష్ణయ్య ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నారన్నారు. ఆయన చేపట్టిన ఉద్యమం ద్వారా ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీసీ సేన నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు వెంకటేశ్, సుధాకర్, వరలక్ష్మీ, చంద్రశేఖర్, శ్రీనివాస్, శంకర్, చందులాల్, భూషణ్, వసంత, మమత, స్రవంతి, అనిత, చెన్నయ్య, మహేందర్, రాజు, దామోదర్ పాల్గొన్నారు.

విజయ్ దేవరకొండను అరెస్ట్ చేయాలి

గిరిజన సంఘాల నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన నటుడు విజయ్ దేవరకొండను వెంటనే అరెస్టు చేయాలని గిరిజన సంఘాల నాయకులు ఆకాశ్‌నాయక్, సంతోష్‌నాయక్, ఆకాశ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గిరిజన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన నటుడు విజయ్ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినా ఎందుకు అరెస్టు చేయడం లేదని ఆరోపించారు. నటుడు అల్లు అర్జున్‌కు ఒక న్యాయం, విజయ్ దేవరకొండకు ఇంకొక న్యాయమా అని ప్రశ్నించారు. గిరిజనులను పాకిస్తాన్ ఉగ్రవాదులతో పోల్చిన వ్యక్తిని ఇప్పటివరకు పోలీసులు అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. ఆయనను అరెస్టు చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ప్రకాశ్‌నాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ నర్సింహారావు

సీఐ నర్సింహారావు

కొత్తూరు: సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు దోహదపతాయని సీఐ నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని కొడిచర్ల, ఎస్‌బీపల్లి గ్రామాల్లో దాత అంబటి ప్రభాకర్ సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించాలని కోరారు. వ్యాపారులు, అపార్ట్‌మెంట్ల యజమానులు తప్పకుండా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం చోటు చేసుకుంటున్న నేరాల దర్యాప్తు, కేసుల ఛేదనలో వాటి ప్రాధాన్యత చాలా వరకు ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాలకృష్ణ, నాయకులు శేఖర్ రెడ్డి, లింగారం సురేష్‌గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, చందు, యాదయ్య, కృష్ణ, బాల్‌రెడ్డి, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్: అఖిల భారత గౌడ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జిగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భీమగౌని భాస్కర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెములయ్య గౌడ్ శనివారం నియామక పత్రం అందజేశారు. పలు కమిటీలను ఏర్పాటు చేస్తూ.. పేర్లను ప్రకటించారు. సంఘం జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడిగా జంగయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలంగౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లేశం గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార స్వామి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు పద్మజ, యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.